
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 11 జనవరి 2024 | 5
తిరుపతి



రాసానికి విశిష్ట సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి - క్యాంపస్

ప్రముఖ కవి, కథ, నవల, నాటక రచయిత డా.వి.ఆర్.రాసానికి రాష్ట్ర ప్రభుత్వం విశిష్ట సాహిత్య పురస్కారం ప్రకటించారు. అన్నిసాహిత్య ప్రక్రియల్లో అందెవేసిన చేయి గానూ, నాటక ప్రయోక్తగా, నటుడిగా, గొప్ప పరిశోధకుడు, సాహిత్యవిశ్లేషకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఉత్తమ అధ్యాపకుడిగా పేరు తెచ్చుకున్నాడు రాసాని. ఇంతవరకు 160 కథలు, 14 నవలలు, 30నాటికలు, 8నాటకాలు,6 పరిశోధనా గ్రంథాలు, రెండు జీవితచరిత్ర లు, కాలమ్ రచనలు ఎన్నో చేశారు. వీరు ప్రచురించిన చీకటి రాజ్యం, ముద్ర, బతుకాట, వలస,స్వప్నజీవి, ఆదియోధుడు లాంటి నవలలు, మెరవణి, విషప్పురుగు, మావూరి కతలు, ముల్లు గర్ర, పయనం లాంటి కథా సంపుటాలు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ, చెంచిత, కాటమరాజు యుద్ధం, అజ్ఞాతంవంటి నాటకాలు వంటివి వీరివి ప్రసిద్ధి చెందినవి. వీరి రచనలపైన పలువిశ్వవిద్యాలయాలలో పలువురు పరిశోధనలు సాగించి పట్టాలు పొందారు. ఏలూరులో జరిగే సభలో వీరికి ఈ పురస్కారాన్ని అందిస్తారు.



కార్పొరేషన్‌లో అవినీతి 'కంపు'

ఉన్నతాధికారుల 'చేతి'వాటం
తిరుపతిలో శానిటేషన్ 'మాఫియా'
అధికార పార్టీతో సమ్మె 'విచ్ఛిన్నకుల' లాలూచీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి 'కంపు' కొడుతోంది. ఉన్నతాధికారులు చేతివాటానికి అలవాటు పడటంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆడిందే ఆట, పాడిందేపాటగా మారింది. అవినీతి ఏ స్థాయికి చేరిందంటే ఓ మాఫియాగా అవతారమెత్తింది. పారిశుధ్య కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ, వారికి ఇవ్వాల్సిన జీతాల్లో కోతలు పెడుతూ తిరుపతి కార్పొరేషన్ శానిటేషన్ 'మాఫియా'గా మారిపోయింది. మలమూత్రాలను, మురుగును, చెత్తను ఒట్టిచేతులతో ఎత్తిపోస్తూ జీవనం గడుపుతున్న మున్సిపల్‌కార్మికులు గత రెండు వారాలుగా సమ్మెలో ఉన్నారు. తమను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం ఇవ్వాలన్నది వారి డిమాండ్. తిరుపతిలో అయితే శానిటేషన్ మాఫియా ముసుగులో వీరిని దోచుకోవడం తీవ్రస్థాయిలో ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు రాష్ట్రవ్యాప్త నిబంధనలను పక్కన పెట్టి తిరుపతిలో మున్సిపల్ కార్మికులకు స్థలాలను ఇప్పిస్తామని నమ్మబలికి దాదాపు 50 లక్షలు పైగా 'వసూల్‌రాజా'లు దండుకున్నారు. 27.44 చ.కి.మీ నగర విస్తీర్ణంలో నిత్యం 250 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతాయి. శానిటరీ విభాగపు మేస్త్రీలు 50 మంది, ఇన్‌స్పెక్టర్లు 22 మంది ఉన్నారు. శాశ్వత పారిశుధ్య కార్మికులు 170 మంది ఉండగా, ఒప్పంద కార్మికులు 882 మంది, చెత్త సేకరణ వాహన డ్రైవర్లు 150 మంది పనిచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమ్మె సక్సెస్‌ఫుల్‌గా నడుస్తుంటే, తిరుపతిలో మాత్రం విచ్ఛిన్నకర శక్తులు సమ్మెను నిర్వీర్యం చేయడం గమనార్హం.

శానిటేషన్ మాఫియా కథాకమామీషు

స్మార్ట్‌సిటీలో శానిటేషన్ మాఫియా చాలా స్మార్ట్‌గా 'ప్రైంగ్'గా ఉంది. ఔరా.. చెత్త సేకరణలో ఇంతటి అవినీతి దాగుందా? అని నోరెళ్లబెట్టేలా అవినీతి దాగుందన్న విమర్శలున్నాయి. మున్సిపల్ కార్మికులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు 'ప్రైవేట్' పనులకు ఉపయోగించుకుంటూ దందా సాగిస్తున్నారు. పొరుగు సేవల పారిశుధ్య కార్మికులకు విధులకు హాజరు కాకపోతే మొత్తం వేతనం చెల్లించడానికి ఓ కమీషన్, అదే శాశ్వత ఉద్యోగికైతే మరో కమీషన్ ఇక్కడ అమలవుతుంది. కార్మికుల కోసం అన్ని డివిజన్లలోనూ రెండు హాజరు పట్టికలు ఉంటాయి. ఉన్నతాధికారులు తనిఖీ చేస్తే తప్పు అన్ని డివిజన్లలోనూ అందరికీ వందశాతం హాజరు వేయడమనే సంప్రదాయం తిరుపతి ప్రత్యేకం. ఈ హాజరుతోనే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రింగై ప్రతినెలా లక్షల్లో అడ్డిస్తున్న వైనం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇంటింటి చెత్త సేకరణను గాలికొదిలి వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్తులు, కల్యాణ మండపాలు వంటి బల్క్ చెత్త ఉత్పత్తిదారుల నుంచి ఎంత పిండుకోవచ్చో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అంత పిండేస్తారన్నమాట. రెండు హాజరు పట్టీలను నిర్వహిస్తూ, పూర్తిస్థాయిలో హాజరు వేస్తూ, కార్మికులను తమ 'ప్రైవేట్' పనులకు ఉపయోగించుకుంటూ పెద్దఎత్తున అవినీతి దందా నడుపుతున్నారని చర్చ నడుస్తోంది. కొంతమంది కార్పొరేషన్ పరిధిలోని విధి నిర్వహణలోనే ఉండరు. అయినా వారికి నెలనెలా జీతం బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ఉన్నతాధికారుల అనుయాయులకు ఇది షరా'మామూలే'. ఆరేళ్లుగా ఓ వ్యక్తి మేస్త్రి హోదాలో పనిచేస్తున్నారు. అతను ఏనాడూ విధులకు హాజరు కాకపోయినా నెలనెలా జీతం జమ అవుతోంది. మామూళ్లలో అధికారులకూ వాటాలు ఉండటంతో ఎవరూ ప్రశ్నించే పరిస్థితి లేదని చర్చ నడుస్తోంది. ఇదే కోవలోనే విధులకు హాజరు కాకుండానే కొంతమంది జీతాలు పొందుతూ, పారిశుధ్య కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తూ వారిని బలి పశువులను చేస్తున్నారన్న విమర్శలున్నాయి. చెత్త సేకరణలో అధిక ఆదాయం ఉన్న వార్డులను కేటాయించేందుకు 'కమీషన్' వర్తిస్తుంది. ఆరోగ్యకరంగా ఎదిగిన 'శానిటరీ' విభాగం అధికారులు కార్మికుల పేదరికాన్ని ఆసరాగా చేసుకుని బ్యాంకు పాసు పుస్తకాలు, ఏటీఎంలను వారి వద్ద పెట్టుకుని 'వడ్డీ' వ్యాపారం చేస్తూ 'కోట్ల'కు పడగలెత్తుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏదిఏమైనా ఔట్‌సోర్సింగ్ కార్మికులను సైతం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పర్మినెంట్ చేసి, పారదర్శకంగా వేతనాలను వారివారి ఖాతాల్లో జమచేస్తూ నగరాన్ని 'సుందరనగరంగా' తీర్చిదిద్దేందుకు పాలకులు 'చెత్త'శుద్ధి చూపాల్సి ఉంది.

ఎర్రజెండా ముసుగులో అధికార పార్టీకి తాకట్టు

'అందరూ ఇన్‌స్పెక్టర్లకు, మేస్త్రీలకు నమస్కారం.. మన సమ్మె ప్రభావంతో తిరుపతి నగరం అంతా చెత్త కుప్పలతో నిండిపోయింది. దీనికితోడు వర్షం వల్ల చెత్తకుప్పలు కుళ్లి దుర్వాసన వస్తోంది. ఫలితంగా అంటువ్యాధులు ప్రబలే ప్రభావం ఉంది. ప్రభుత్వం మన పట్ల కనీస ధర్మం పాటించకపోయినా, మనం తిరుపతి ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారుల విజ్ఞప్తి మేరకు రేపు స్వచ్ఛంద సేవ చేయాలని నిర్ణయించడమైనది. ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, కార్మికులు అందరూ సమ్మెలో పాల్గొంటూనే స్వచ్ఛందంగా సేవకు సన్నద్ధం కావాలని యూనియన్ విజ్ఞప్తి చేస్తోంది. ప్రతి లీడర్ మన జెండా, మన కోర్కెల బ్యానర్ ప్రదర్శిస్తూ పుర పారిశుధ్యంలో రేపు పాల్గొనాలని కోరుతున్నాం.. త్వరలోనే శుభవార్త వస్తుందని ఆశిస్తున్నాం. ఇట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్, తిరుపతి' అంటూ ఓ రాష్ట్ర స్థాయి నాయకుడు పై విధంగా మెసేజ్ పెట్టి స్వచ్ఛంద సేవను నిరవధిక సమ్మెలో ఉన్న కార్మికులతో చేయించడం గమనార్హం.

జిల్లావ్యాప్తంగా గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి మున్సిపాలిటీల్లో సిఐటియు ఆధ్వర్యంలో వీరోచితంగా మున్సిపల్ పార్మికులు 'ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్' (సిఐటియు) ఆధ్వర్యంలో పోరాడుతుంటే, తిరుపతిలో నిర్వీర్యం చేసేలా ఆ రాష్ట్ర కార్మిక నాయకుని చర్యలు 'ఎర్రజెండా'కే తలవంపులు తెచ్చేలా 'స్వచ్ఛంద సేవ'ను కార్మికులతో చేయించడం కార్మికులు డోలాయమానంలో పడేలా చేసిందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇదంతా కూడా 'శానిటేషన్ మాఫియా'లో భాగమేనా? అన్న అనుమానం కలగక మానదు.


తిరుపతిలో అధికార పార్టీతో లాలూచీపడి సమ్మె విచ్ఛిన్నకుల 'స్వచ్ఛందసేవ'

సిఐటియు ఆధ్వర్యంలో కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సి.ఐ.టి.యు (అనుబంధం) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపు మేరకు మునిసిపల్ పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె బుధవారానికి 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణ సి.ఐ.టి.యు అధ్యక్షులు బి.వి.రమణయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాబోయే ఎన్నికల్లో ఎలా గెలవాలి అనే ఆలోచిస్తున్నారే కానీ, మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసారని, పలు సమస్యలు నెరవేర్చకపోవడంతో వైఎస్సార్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు . పాలకులు మాత్రం వారి అధికారాలు చేజిక్కించుకోవడం కోసం తాడేపల్లి ప్యాలెస్ కి అంకితం అయ్యారని, ఎమ్మెల్యే టికెట్లకు పరుగులు తీస్తున్నారని, ఉత్కంఠగా ఎవరికి వారే ఉన్నారే కానీ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె కానీ మరొక పక్క అంగన్వాడి కార్యకర్తలు చేస్తున్న సమ్మెలు కానీ శిబిరాలకు వద్దకు వెళ్లి వాళ్ళని పరామర్శించడం కానీ ఇంతవరకు చేయకపోవడం ప్రజలలో చర్చినీయాశంగా మారిందన్నారు. సంక్రాంతి పండగలు ముందుకు వస్తున్నాయని వాటిని దష్టిలో ఉంచుకొని సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని 18,500 జీతం ఇవ్వాలని, వారి న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.గోపీనాథ్, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, కార్యదర్శి దారా. కోటేశ్వరావు, బి.పెంచల ప్రసాద్, రాఘవయ్య, శ్రామిక మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు,బి. ఎస్.ప్రభావతి, ఎం.సంపూర్ణమ్మ పాల్గొన్నారు.


పట్టు విడవక సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమ్మె

నేడు సఫాయికర్మచారి జాతీయ కమిషన్ రాక

తిరుపతి టౌన్ : సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు పీపి వహా నాలుగు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న గురువారం రాత్రి తిరుపతి చేరుకుని బస చేస్తారు. 12న తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం కార్పొరేషన్ అధికారులతో సమావేశం అవుతారు. 13న వివిధ బ్యాంకర్లతో సమావేశమై, 14న తిరుగు ప్రయాణం అవుతారు.

టిటిడి ఛైర్మన్‌ను కలిసిన వీసీ శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

టీటీడీ ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డిని ఎస్వీయూ నూతన వీసీ శ్రీకాంత్ రెడ్డి బుధవారం ఉదయం స్థానిక పద్మావతి పురంలోని భూమన నివాసం వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్చం సమర్పించి, దుశ్శాలువతో సత్కరించారు. ఎస్వీయూ నూతన వీసీగా భాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ రెడ్డిని భూమన కరుణాకర రెడ్డి దుశ్శాలువతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

అంబేద్కర్ స్మృతివనం పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి టౌన్ : విజయవాడలో ఈనెల 19వ తేదీన ప్రారంభించనున్న అంబేద్కర్ స్మృతివనం ప్రారంభోత్సవ ఆహ్వాన పోస్టర్‌ను టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రారంభించారు. పద్మావతిపురంలోని వారి నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు నల్లాని బాబు, కోఆర్డినేటర్ దేవదానం పాల్గొన్నారు. 125 అడుగుల స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి అంబేద్కర్‌వాదులంతా తరలిరావాలని కోరారు.

'చంద్రబాబును ఓడించడం పెద్దిరెడ్డితరం కాదు'

తిరుపతి సిటి : కుప్పంలో చంద్రబాబును ఓడించడం పెద్దిరెడ్డి తరం కాదని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి సవాల్ విసిరారు. కుప్పంలో ఓడిపోతామన్న భయంతో చంద్రబాబు రెండు చోట్ల పోటా చేస్తారని చెప్పడంలో అర్థం లేదన్నారు. చంద్రబాబు కుప్పంలో వరుసగా ఏడుసార్లు గెలిచిన ఓటమి ఎరుగని ధీరుడని పేర్కొన్నారు. చంద్రబాబు తిరిగి గెలిస్తే పెద్దిరెడ్డి రాజకీయ సన్యాసానికి సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలో టిడిపికి 160 స్థానాలు వస్తాయని, చంద్రబాబు ముఖ్య మంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

'ప్రత్యేక' సర్వీసులకు సాధారణ ఛార్జీలే : ఆర్‌ఎం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక బస్ సర్వీసులకు ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయకుండా, సాధారణ చార్జీలకే పరిమితం అవుతూ జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. సాధారణంగా ప్రత్యేక సర్వీసులకు 1 1/2 చార్జీలను అదనంగా తీసుకునేవారు. అయితే గత మూడు సంవత్సరాలుగా ప్రత్యేక సర్వీసులకు అదనపు చార్జీలు వసూలు చేయడం లేదు. విశాఖపట్నంలో రెండు రోజుల క్రితం ఆర్టీసీ ఎండీ పర్యటన సందర్భంగా ప్రత్యేక సర్వీసులపై అదనపు చార్జీలు ఉండవని స్పష్టత ఇవ్వడంతో తిరుపతి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సాధారణ చార్జీలను వసూలు చేయనున్నారు. తిరుపతి జిల్లాలోని పలు డిపోల నుంచి 233 బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచారు. సంక్రాంతి ముందు 142 సర్వీసులు, సంక్రాంతి తర్వాత 91 సర్వీసులు నడపనున్నారు.

సాధారణ చార్జీలే
ఆర్‌ఎం టి.చెంగల్‌రెడ్డి

సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఏపీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సు సర్వీసుల్లో సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నాం. జిల్లా నుంచి 233 సర్వీసులను నడుపుతున్నాం. వీటన్నిటికీ రిజర్వేషన్ సౌకర్యం కల్పించాం. రాను పోను ఒకేసారి రిజర్వ్ చేసుకున్న ప్రయాణికులకు పది శాతం రాయితీ ఇస్తున్నాం. ప్రయాణికులు ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి.

వరద బాధితుల ధర్నా

ప్రజాశక్తి - నాయుడుపేట

'తహశీల్దార్ రావాలి.. మాకు న్యాయంచేయాలి.. విఆర్ఒ శ్రీనివాసరావు డౌన్‌డౌన్' అంటూ నాయుడుపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద లోతట్టు ప్రాంతమైన లోతువానిగుంట వాసులు బుధవారం ధర్నా నిర్వహించారు. మిచౌంగ్ తుపాను వరద బాధితుల సాయం తమకు అందలేదంటూ రెండు రోజుల క్రితం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అయినా వీరి గోడు ఎవరూ పట్టించుకోకపోవడంతో తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. నాయుడుపేటలో అన్ని మెట్ట ప్రాంతాలకు వరద సాయం తొందించి, అతి లోతట్టు ప్రాంతమైన తమను విస్మరించడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని తమ వరకే చేరకుండా మధ్యలోనే వైసిపి నాయకులకు చెందిన వారికి అందిస్తూ, నొక్కేస్తున్నారని మండిపడ్డారు. తమ బాధ చెప్పుకునేందుకు రాస్తారోకో చేస్తే ఎంఎల్‌ఎ సంజీవయ్య తమపై పోలీసులను ప్రయోగించారు తప్ప, తమకు న్యాయం చేయలేదని వాపోయారు. తుపాను సమయంలో మోకాలి లోతు నీళ్లలో కనీసం బయటకు వచ్చే పరిస్థితి లేకుండా ఇంట్లోనే పసి పిల్లలతో అవస్థలు పడ్డామని, అధికారుల కళ్లకు తాము కనిపించలేదా? అని నిలదీశారు. పలుమార్లు ఎంఆర్ఒ రాజేంద్రకు తమ గోడు వినిపించేందుకు ప్రయత్నించినా రానీయలేదని, విఆర్ఒ శ్రీనివాసులు తమ ప్రాంతాన్ని ఒక్కసారి కూడా సందర్శించలేదన్నారు. తమ సమస్య వింటామని రమ్మని చెప్పిన ఎంఆర్ఒ రాజేంద్ర కార్యాలయంలో లేకపోవడంతో ఆందోళనను మరింత ఉధృతం చేశారు. ఆర్ఐ సాయితేజ, నాయుడుపేట ఎస్ఐ రఘునాథ్ వాళ్లకు సర్దిచెప్పి ఎంఆర్ఒతో మాట్లాడించారు. రాతపూర్వకంగా వినిపత్రాన్ని తీసుకుని, తప్పక న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సరసమ్మ, మేరమ్మ, కోకిల, హరికృష్ణ పాల్గొన్నారు.



ఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎఫ్ నిరసన

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'హిట్ అండ్ రన్' చట్టం ఉపసంహరింప చేయాలని ,డ్రైవర్ల వత్తిని కాపాడాలని, శిక్షలు తగ్గించాలని తిరుపతి డిపో వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన జరిగింది. డిపో కార్యదర్శి ఎన్‌వికె రెడ్డి అధ్యక్షత వహించారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే పరుశురాం ,జోనల్ కార్యదర్శి సి భాస్కర్ ,జిల్లా కార్యదర్శి ఈ.శివకుమార్ ,బహుజన వర్కర్స్ ఫెడరేషన్ డిపో కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ డ్రైవర్ల జీవితం ఎంతో కష్టంతో కూడుకున్నదని, అయినప్పటికీ కష్టపడి డ్యూటీలు చేస్తూ ప్రజాసేవ చేస్తున్నారని, అనుకోకుండా జరుగుతున్న యాక్సిడెంట్లకు పూర్తిగా డ్రైవర్లనే బాధ్యులు చేస్తూ శిక్షలు పెంచి చట్టం చేయడం సమంజసం కాదన్నారు. ఇలా చేస్తే డ్రైవరు వత్తిని ఎంచుకునేవారు భవిష్యత్తులో తగ్గిపోతారన్నారు. ప్రజలు ,సరుకు ట్రాన్స్పోర్టుగా నిర్వహిస్తున్న డ్రైవర్లకూ కుటుంబం ఉందని, ఆ కుటుంబం రోడ్డుమీద పడకూడదని చాలా జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తుంటారని, కానీ ఆక్సిడెంట్లు రూపంలో వారికి, వారి కుటుంబానికి ఇబ్బందులు రాకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దినకర్, రమణ, డేనియల్, మధు, ప్రసాద్, మొగిలయ్య, మీగనాథం, చిట్టిబాబు, పద్మనాభం పాల్గొన్నారు.



ఇవిఎం, వివిపాట్‌లపై అవగాహన వుండాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాబోయే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ లో భాగంగా ఈ.వి.ఎం , వివి పాట్ లపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉన్నపుడే ఎన్నికల నిర్వహణ సజావుగా ఉంటుందని డిఆర్ఓ పెంచల కిషోర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో డిఆర్ఓ ఆధ్వర్యంలో పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లపై నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ ల కు స్పెషల్ డిప్యూటి కలెక్టర్ కోదండ రామి రెడ్డి పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ల వినియోగం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.



వేతన సవరణ జరపాలి : ఎల్‌ఐసి

ఉద్యోగుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

వేతన సవరణ తక్షణం జరపాలని కోరుతూ ఎల్‌ఐసి ఉద్యోగులు తిరుపతిలోని బ్రాంచ్ 1, బ్రాంచ్ 2, సేల్స్ ట్రైనింగ్ సెంటర్లలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల నుండి ఒంటి గంట 30 నిమిషాల వరకు గంట పాటు విధులు బహిష్కరించి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నా నుద్దేశించి ఉద్యోగుల డివిజన్ నాయకుడు వై. కష్ణ కుమార్ మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న వేతన సవరణ వెంటనే జరపాలని డిమాండ్ చేశారు. క్లాస్ వన్ అధికారుల జిల్లా నాయకులు ఇ. వెంకట ముని మాట్లాడుతూక్లాస్ 1 క్లాసు2, క్లాస్ త్రీ ఉద్యోగులు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. డెవలప్ మెంట్ ఆఫీసర్ల నాయకులు తీర్థానంద రెడ్డి, బాలకష్ణ, రమేష్ ,రామ్, రమేష్ కుమార్, రాజశేఖం పాల్గొన్నారు.



పూతల'పట్టు' ఎవరికో..!

వైసిపిలో ఆశావాహులు క్యూ / ఎంఎస్‌బాబుకు సీటు లేనట్లే..

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అధికారం మరోసారి చేజిక్కించుకోవడం కోసం జగన్ వ్యూహ(సీట్ల)రచన చేస్తున్నారు. తానే స్వయంగా అభ్యర్థుల ఎంపికకు రంగంలోకి దిగారు. తెలంగాణాలో అధికారంలో ఉన్న కెసిఆర్ ఓటమి పాలుకావడంతో సీట్ల విషయంలో మరింత 'పట్టు' బిగిస్తున్నారు. తొలి సర్వేలో పూతలపట్టు ఎంఎల్‌ఎ ఎంఎస్‌బాబుకు సీటు ఇస్తే ఓడిపోతారని వచ్చింది. 'బాబు తప్పుకోండి' అంటూ తాడేపల్లిలో మర్యాదగా చెప్పారు. దీంతో ఆశావాహులు పూతలపట్టు సీటు కోసం క్యూ కడుతున్నారు. మాజీ ఎంఎల్‌ఎ డాక్టర్ సునీల్ పేరు ప్రధానంగా వినిపిస్తున్నప్పటికీ తాను డబ్బు ఖర్చు పెట్టుకోలేనని, పార్టీ సాయం చేస్తే గెలిచి తీరుతానని చెబుతున్నట్లు సమాచారం. మరోపక్క మాజీ ఎంపి డాక్టర్ శివప్రసాద్ సోదరి నారమల్లి పద్మజ సైతం ఈ సీటుపై ఆశ పెట్టుకున్నారు. యాదమరి ఎంపిపి సురేష్, పలమనేరు మాజీ ఎంఎల్‌ఎ లలిత థామస్, గుంటూరుకు చెందిన ఓ ప్రముఖ డాక్టర్ సైతం సీటు కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఎంఎస్‌బాబు మాత్రం దింపుడుకల్లెం ఆశతో చివరి నిమిషంలో అయినా తనకు అవకాశం ఇస్తారని నిరీక్షిస్తున్నారు. బెంగుళూరులో సామాన్య బిల్డర్‌గా సెటిలైన ఎంఎస్‌బాబు జగన్ క్రేజ్‌లో ఎంఎల్‌ఏగా గెలుపొందారు. అయితే పూతలపట్టులో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేయడంలోనూ, అభివృద్ధి పరచడంలోనూ అతని పట్ల అసంతృప్తి నెలకొందని సమాచారం. ముఖ్యంగా అతనిపై అవినీతి ముద్ర ఉందని కార్యకర్తలే ఆరోపిస్తున్నారు. ఏమైనప్పటికీ పూతలపట్టు పైన వైఎస్ఆర్ కాంగ్రెస్ ఆశావాహులు తాడేపల్లి జగన్ క్యాంపస్‌లో క్యూలో ఉన్నారు. మరి ఆ సీటు ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.


నాయుడుపేటలో కళ్లకు గంతలతో..


తిరుపతిలో రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు

భ(ఎ)స్మాసురమే..!

ప్రభుత్వానికి అఖిలపక్షం హెచ్చరిక
సమ్మెకు మద్దతుగా రౌండ్‌టేబుల్
మట్టితింటూ, గంతలతో వినూత్న నిరసనలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అంగన్‌వాడీల సమ్మెపై ప్రభుత్వం ఎస్మాను పెట్టి బెదిరించడం మానుకోవాలని, జీతాలు పెంచాలని కోరుతూ పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో అఖిలపక్షం బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మెను ఎస్మా చట్టంతో నిరోధించలేరన్నారు. ప్రభుత్వం నిర్బంధాన్ని ఆపి చర్చలు జరిపి, సమ్మెను విరమింపజేయాలని, లేదంటే ఎస్మా భస్మాసుర హస్తం అవుతుందని హెచ్చరించారు. ప్రజల మద్దతుతో సమ్మెను ముందుకు తీసుకెళతామని, అవసరమైతే రాష్ట్ర బంద్‌కు వెనుకాడబోమని హెచ్చరించారు. టిడిపి తిరుపతి పార్లమెంటరీ అధ్యక్షులు జి.నరసింహయాదవ్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధిఒవి రమణ, ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు పి.అంజయ్య, సిపిఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు సురేంద్రనాథ్, జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి, ఆమ్ ఆద్మీ జిల్లా అధ్యక్షులు నాగేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె న్యాయబద్ధమే కాదు చట్టబద్ధమైనదన్నారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్లే రాష్ట్రంలో అనేక సమ్మెలో జరుగుతున్నాయని విమర్శించారు. సమస్యలను పరిష్కరించకపోతే 2024లో జగన్మోహన్‌రెడ్డి ఇంటికి పోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు నాగరాజమ్మ జయప్రభ, ఎల్లమ్మ గీత, గోమతి, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, సుజిత, సుశీలమ్మ, గంగ ఐద్వా నాయకులు ఎం.జయంతి, ఆటో యూనియన్ నాయకులు తంజావూరు మురళి, టిటిడి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డీ. పార్థసారథి, ఏఐటీయూసీ నాయకులు ఎన్ డి రవి, కె వై రాజా తదితరులు పాల్గొన్నారు.

- నాయుడుపేటలో సిఐటియు జిల్లాకార్యదర్శి శివకవి ముకుంద ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు.
- గూడూరులో సిఐటియు నాయకులు ప్రసాద్‌రావు, అంగేరి పుల్లయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వాణిశ్రీ పాల్గొన్నారు. సిఐటియు నాయకులు బివి రమణయ్య, ఎస్.సురేష్ ఉన్నారు.
- సత్యవేడులో సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ప్లేట్‌లో మట్టి పెట్టుకుని తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. జీతాలు పెంచకపోతే తాము మట్టి తిని బతకాల్సిందేనని అంగన్‌వాడీలు నిర్మల, అనురాధ, సుజాత, భువన వాపోయారు.
- పుత్తూరు టౌన్‌లో వడమాలపేట టిడిపి నాయకులు ధనుంజయనాయుడు, ఎస్‌బిఆర్ పురం సర్పంచి ఆర్.మణిరాజు, గాలి జీవరత్ననాయుడు, లక్ష్మీ ప్రసన్న తదితరులు సంఘీభావం ప్రకటించారని సిఐటియు జిల్లా నాయులు వెంకటేస్, నందయ్య పేర్కొన్నారు.
- సూళ్లూరుపేటలో సమ్మెను ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ నాయకురాలు మేకల హైమావతి హెచ్చరించారు. సిఐటియు కార్యదర్శి కె.లక్ష్మయ్య, బి.పద్మనాభయ్య, సుంకర అల్లయ్య, పి.మనోహరం పాల్గొన్నారు.
- శ్రీకాళహస్తిలో ఎస్మా జీవోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళతామని గంధం మణి, రేవతి, పుష్ప, సక్కుభాయమ్మ పేర్కొన్నారు.
- చంద్రగిరిలో అంగన్‌వాడీలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు.


సత్యవేడులో 'మట్టి' తింటూ..

ప్రాణం తీసిన కల్తీ కల్లు.. ఒకరు మృతి

ప్రజాశక్తి - ఓజిలి : కల్తీ కల్లు ఒకరి ప్రాణం తీసి, ముగ్గురుని అస్వస్థతకు గురిచేసింది. మండల పరిధిలోని వేమునకుద్రిగ లో ఈ సంఘటన చోటు చేసుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వేమునకుద్రిగకు చెందిన . మురుగేష్ , వెంకటేశ్వర్లు ,తిగ చిన్నయ్య ,ఎం. పోలయ్య రాముడురెడ్డిపాలెం గ్రామ సమీపంలో కల్తీ కల్లు తాగడం వల్ల తీవ్రమైన కడుపునొప్పి వాంతులతో అస్వస్థత గురయ్యారు. వీరిలో మురుగేష్(30) మృతి చెందగా ముగ్గురిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు నాయుడుపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మీతుడు మురుగేష్ కు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. తండ్రి కల్తీ కల్లు తాగి మృతి చెందడంతో చిన్నపిల్లలను చూసి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న మురుగేష్ ను కల్తీ కల్లు బలి తీసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

వైసిపి మండల కమిటీ సెక్రటరీగా సురేంద్ర

ప్రజాశక్తి -కోట : వైసిపి కోట మండల కమిటీ సెక్రటరీగా కర్లపూడి గ్రామానికి చెందిన పాముల సురేంద్ర పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ ఎంపికకు సహకరించిన వైసిపి సీనియర్ నాయకులు నన్నారెడ్డి, చెంచు రాఘవ రెడ్డికి వైసిపి కోట మండల అధ్యక్షులు పలగాటి సంపత్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సురేంద్ర మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన ఈ పదవికి న్యాయం చేస్తానని, వచ్చే ఎన్నికల్లో శక్తి వంచనా లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

రక్తదానం ప్రాణ దానంతో సమానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని జెవిపి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జెవిపి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యాదానం తరువాత రక్తదానం ఎంతో గొప్పదని నిరుపేదలకు అవసరమైన రక్తం ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ లో ఎలాంటి ఛార్జీలు లేకుండా పేదలకు అందిస్తారన్నారు. జెవిపి ఆధ్వర్యంలో రక్తదానం చేశామని, ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ఇన్ఛార్జి సందీప్, రాజేంద్రప్రసాద్, మౌలాలి, చెంచునారాయణ, రామమోహన్, మస్తాన్, ప్రభాకర్, చిరంజీవి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుగంగ ఉప కాలువ వద్ద ప్లాట్లు

అడ్డుకున్న అధికారులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పలు గ్రామాలకు సాగు నీటిని సరఫరా చేసే తెలుగుగంగ ఉప కాలువను ఆనుకుని ఉన్న స్థలం ఆక్రమణకు గురైంది. శ్రీకాళహస్తి - తడ రోడ్డు నీరుకోట గ్రామంలోని స్థానిక పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న పట్టా భూముల్లో ప్లాట్లు వేశారు. ఈ భూమి మీదుగా గతంలో తెలుగుగంగ ఉప కాలువ నిర్మించారు. అప్పట్లో ఈ భూమికి నష్టపరిహారం చెల్లించారు. ఈ భూమికి అధిక ధర పలుకు తుండటంతో ప్రస్తుతం ఈ భూమిలో ప్లాట్లు వేసి కాలువ చివరి వరకు రోడ్డు ఏర్పాటు చేసి ఆక్రమించారు. విషయం తెలుసుకున్న తెలుగుగంగ అధికారులు కాలువకు సంబంధించిన భూమిలో రోడ్డు వేయరాదని బుధవారం పనులను అడ్డుకున్నారు.


తెలుగుగంగ కాలువ వద్ద ప్లాట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

రైల్వే ఉద్యోగుల దీక్ష

ప్రజాశక్తి-పాకాల: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని రైల్వే ఉద్యోగస్తుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాడుతామని రైల్వే ఎంప్లాయిస్ సంగ్ పాకాల బ్రాంచ్ కార్యదర్శి పిఎం శివకుమార్ అన్నారు. రైల్వే జంక్షన్ కేంద్రంలో బుధవారం సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంగ్ పాకాల బ్రాంచ్ కార్యదర్శి పి.ఎం శివకుమార్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ శంకర్, తులసి రామ్ రెడ్డి, చైతన్య కుమార్, హేమంత్ కుమార్, వెంకటేష్, దయానంద్, ఇతర సంఘ నాయకులు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

ఘనంగా 'సాయి విద్యానికేతన్' వార్షికోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సాయి విద్యానికేతన్ పాఠశాల మూడవ వార్షి కోత్సవం స్థానిక డిఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఘనంగా నిర్వ హిం చారు. ఈ సంద ర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ పాఠశాల మూడవ వార్షికోత్సవం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని, తమ పాఠశాల విద్యార్థు లకు ఎంతో క్రమశిక్షణతో విద్యాబుద్ధులు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తూ విలువలు నేర్పించే పాఠశాలలు ముందుకెళుతోందన్నారు. విద్యార్థులు నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి వార్షికోత్సవాలు ఉపయోగ పడుతాయన్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారని తెలిపారు. వారి నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం దోహద పడు తుంద న్నారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథులు అరుణ్ , ఉపాధ్యాయులు జమీర్ బాషా, మల్లి కార్జున ,మనోజ్, దయాకర్, బాలకృష్ణ, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు, విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారు.

నడకతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నడక వల్ల రోగాలు దరిచేరవని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. వారి ఆధ్వర్యంలో తిరుపతిలోని అన్ని వాకర్స్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతిలోని14 వాకర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డా.దేవరాజులు, వెంకట్ రెడ్డి, రెడ్డివారి ప్రభాకర్ రెడ్డి, ఐదుగిరి రఘు, బాసికర్ల రఘు, గోపిప్రసాద్, రామమూర్తి , విజయభాస్కర్ రెడ్డి తదితర వివిధ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు లేవని నిరూపిస్తారా?: ఈశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లు లేవని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కాణిపాకంలో ప్రమాణం చేసి నిరూపిస్తారా? అని టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబునాయుడు యుడును విమర్శించే స్థాయి మోహిత్ కు లేదని, ముందు మోహిత్ రెడ్డి రాజకీయ అనుభవం గడించాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చంద్రగిరి నియోజకవర్గంలో మాత్రమే దొంగ ఓట్లు తొలగించాలని శ్రుతి మించి పోయిందన్నారు. దొంగ ఓట్లు లేకపోతే 20 నుంచి 25 వేల ఓట్లను ఎందుకు తొలగించారని మోహిత్ రెడ్డి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ అధ్యక్షులు ఈశ్వరయ్య, సురేష్ కుమార్, శ్రీనివాసులు, పెరుగు భాస్కర్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి వ్యక్తి మృతి


సముద్రంలో మునిగి మృతి చెందిన రాంప్రసాద్

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: కుటుంబంతో సరదాగా సముద్ర స్నానం చేస్తూ వ్యక్తి ప్రమాద వశాత్తు మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వరదయ్య పాలెం బస్టాండ్ అవరణలో కూరగాయల దుకాణం నడుపుతున్న ఆటో రామ్ ప్రసాద్ భవాని మాల వేసుకుని తమిళనాడులో గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా మహాబలి పురం వద్ద కుటుంబ సభ్యులతో సముద్రంలో స్నానం చేసేందుకు ఉపక్రమించారు. ఆ సమయంలో అలలు ఉధృతంగా వచ్చి రాంప్రసాద్ ని లాక్కొని వెళ్లడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. రాము మృతితో స్వగ్రామమైన పద్మాపురంలోను ఇటు వరదయ్యపాలెం ఆటో స్టాండ్ లో విషాద ఛాయలు అలు ము కున్నాయి.

సమయపాలన పాటించకుంటే చర్యలు

- ఆకస్మిక తనిఖీలో ఎస్వీయూ విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు సమయపాలన కచ్చితంగా పాటించాలని లేదంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఉప కులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం వర్శిటీ పరిపాలన భవనంలోని ఫైనాన్స్ బ్రాంచ్, స్పెషల్ సెల్ లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ సిబ్బందితో ముచ్చటించారు. పరిపాలనా భవనంలోని వివిధ విభాగాలలో పనిచేసే ఉద్యోగులందరూ సమయపాలన కచ్చితంగా పాటించాలని, ఎక్కడా పెండింగ్ ఫైల్స్ ఉండకూడదని సూచించారు. ఉద్యోగుల హాజరుపై, పనితీరుపై నేరుగా వివరాలు తీసుకున్నారు. సిటీలోని పరిపాలన భవనం, వివిధ డైరెక్టరేట్లు, ప్రిన్సిపల్ ఆఫీసు భవనాల చుట్టూ, ఆఫీసుల చుట్టూ విద్యార్థులు, పరిశోధకులు, ఉద్యోగులను తిప్పుకోవద్దని, ఖచ్చితమైన సమాచారం వారికి అందించాలని అన్నారు. నెలలో ప్రతివారం ఒక్కో విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తామని తెలిపారు. ఎస్వీయూ అన్ని ప్రిన్సిపల్ ఆఫీసులలో సమయపాలన పాటించాలని, ఆఫీసులలో ఖాళీ సీట్లు కనబడకూడదని, ఏ ఫైల్ కూడా 12 గంటల కంటే ఎక్కువ సమయం ఉద్యోగుల టేబుల్ పై ఉండకూడదని, సమయపాలన విషయంలోనూ ఖచ్చితంగా వుండాలని ఉద్యోగులకు మార్గదర్శకాలు ఇచ్చారు. తప్పుచేస్తే క్రమశిక్షణ చర్యలు కింద తక్షణం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరి, నిర్లక్ష్య సమాధానాలు ఎలాంటి పరిస్థితుల్లోనూ సహించేదిలేదని హెచ్చరించారు.


ఎస్వియూలో వివిధ విభాగాల్లో తనిఖీ చేస్తున్న విసి శ్రీకాంత్‌రెడ్డి

ఘనంగా 'అకార్డ్ తరంగ్'


అకార్డ్ స్కూలు వార్షికోత్సవంలో పాల్గొన్న మేయర్ శిరీష


ప్రజాశక్తి -తిరుపతి సిటీ: అకార్డ్ 10వ వార్షికోత్సవం సందర్భంగా అకార్డ్ తరంగ్ ను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పిఎల్ఆర్ కన్వెన్షన్‌హాలులో జరిగిన కార్యక్రమానికి తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 1984లో ప్రశాంత్ ఇంగ్లీష్ మీడియం ద్వారా విద్యారంగంలోకి ప్రవేశించామన్నారు. 24 మంది విద్యార్థులతో ప్రారంభించిన తమ స్కూలు ప్రస్తుతం 1800 మందితో నడుస్తోందన్నారు. తన కుమారులు ఇద్దరు విద్యారంగంలో ఒక ప్రవేశించి ఆకార్డ్ స్కూలును 2012లో స్థాపించి, ప్రస్తుత నాలుగు బ్రాంచీలతో 48 విద్యార్థులతో నడుస్తోందన్నారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులు సహకారంతోనే స్థాయికి వచ్చామని తెలిపారు. ముఖ్య అతిథి శిరీష మాట్లాడుతూ ప్రశాంతి స్కూల్ నుంచి అనేకమంది విద్యార్థులు చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. తమ కుటుంబ సభ్యులు కూడా స్కూల్ కి సుపరిచితులేనని, ఇదే స్కూల్లో చదివిన అనేక మంది డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారన్నారు. పిల్లల్లోని ఆసక్తిని గమనించి, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహించాలని సూచించారు. భావి భారత పౌరులైన విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించేందుకు కృషి చేస్తున్న అకార్డు స్కూల్ యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. పద్మావతి మహిళ యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ రజిని మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పి, వారి భవిష్యత్తుకు బంగారు బాటల్లో వేసేందుకు అకార్డ్ కృషి అభినంద నీయమన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆ స్కూల్ డైరెక్టర్ నువ్వు వివేక్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యాయస్థానాలకు 'ప్రభుత్వ సంకెళ్లు వేయకండి'

- డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు జి చిన్నబాబు

ప్రజాశక్తి - తిరుపతి: రెవెన్యూ మంత్రి ధర్మాన మాటలు అధర్మంగా వున్నాయని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చీకటి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని నవీన్ హెచ్చరించారు. తిరుపతి కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు భూ హక్కుల చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న 3 వ రోజు రిలే నిరాహార దీక్షకు బుధవారం జి చిన్న బాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న భూహక్కుల చట్టం 27/ 2023 ను న్యాయవాదులతో పాటు ప్రజలందరూ వ్యతిరేకించకపోతే రాబోవు కాలంలో తమ ఆస్తులపై హక్కులు కోల్పోతారన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి "ధర్మాన అధర్మంగా" మాట్లాడుతున్నారని భూ హక్కుల చట్టం కార్యరూపం దాల్చలేదని అధికారులను నియమించడం లేదని ఒకపక్క చెబుతూ మరోపక్క ప్రభుత్వ జీవోలను విడుదల చేయడం రాష్ట్ర ప్రజలకు ' ద్రోహం చేయడం కాదా?' అని ప్రశ్నించారు. వెంటనే "ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్" చట్టాన్ని ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. చట్టాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోని పక్షంలో రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజల్ని చైతన్యపరిచి పోరాటాలకు సన్నద్ధం చేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్, పూర్వ అధ్యక్షులు దినకర్, న్యాయవాదులు ఆనంద్, దేవరాజులు, రమేష్, హరీష్, రాజశేఖర్, హరికృష్ణ, వెంకటేష్,రమణ యువజన సంఘం నాయకులు జి కృష్ణ సురేష్ హరికృష్ణ రెడ్డి ప్రసాద్ దీక్షలో పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు


ఎస్వి జూనియర్ కళాశాలలో

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుమల తిరుపతి దేవస్థానముల శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి పండుగను ప్రిన్సిపాల్ సి ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందు సంక్రాంతి విశిష్టతను తెలిపి, సూర్య పూజలు నిర్వహించి అనంతరం ముత్యాల ముగ్గుల నడుమ భోగి మంటలను వెలిగించి పండుగకు ముందే కొత్త శోభను తీసుకొచ్చారు. తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ వస్త్రధారణలతో అధ్యాపకులు, విద్యార్థులు గొబ్బెమ్మ పాటలు పాడుతూ ఆడుతూ ఆనందోత్సాహాలతో సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. విద్యార్థులు జంగమదేవర వేషధారణలతో ఆకట్టుకున్నారు. గాలిపటాలను ఎగరేస్తూ, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సంప్రదాయ వంటలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి ప్రియవర్ధన బాబు, వై గంగాధర్ రావు, పిప్రసాద్, వై మహేశ్వరయ్య, డా సిఎల్‌చెన్నా రెడ్డి, ఈ లోకేష్ రెడ్డి, వి ప్రసన్న లక్ష్మి, కెవిరమణమ్మ, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

'శ్రీనివాస్ తేజ' స్కూల్లో ..

బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు లోని శ్రీనివాస తేజ స్కూల్ లో స్కూల్ అధినేత సుధాకర్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులలో పాల్గొన్నారు. ముగ్గులు పోటీలు, భోగి మంటలు, గొబ్బెమ్మలు, పొంగళ్ళు, హరి దాసులు వంటి వివిధ రకాలైన సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముగ్గులు పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం అందరికీ రుచికరమైన భోజనం అందిం చారు.

'శ్రీసాయి గణేష్'లో..

రేణిగుంట : రేణిగుంట మండలం గాజులమడ్యంలోని శ్రీసాయి గణేష్ విద్యాలయంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను విద్యాసంస్థల అధినేత గాజులమండ్యం ఎంపిటిసి జువ్వల ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రేణిగుంట మండలంలోని గాజుల మండ్యం గ్రామంలో శ్రీ సాయి గణేష్ విద్యా లయంలో ముందస్తు సంక్రాంతి సంబరాలలో సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి భోగి, పొంగల్లు, రంగవల్లికలు నిర్వహించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆటల పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథి ఎంపిపి కలపాటి హరిప్రసాద్ రెడ్డి, స్థానిక ఎంపిటిసి సభ్యుడు జువ్వల ధనంజయ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు జువ్వల దయాకర్ రెడ్డి,జగదీష్ రెడ్డి, విద్యాసంస్థ డైరెక్టర్లు చెంచు రెడ్డి,కుమార్ రాజు లు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామచంద్రపురం, (చంద్రగిరి): సంక్రాంతి సంబరాలు సందర్భంగా: పండుగలు మన సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకలని శ్రీ చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ భవన యజమానులు లంకెల లలిత, శ్రీరాముల దంపతులు అన్నారు. చంద్రగిరి పట్టణంలోని చైతన్య చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాలలో బుధవారం సంక్రాంతి ముందస్తు సంబరాలను ఎంతో ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణలో పాఠశాలకు వచ్చారు. భోగి మంటలు వేయటం,భోగి పండ్లు పోయటం, ఇండ్ల వద్దకు హరిదాసులు,గంగిరెద్దులు కోయ దొరలు ,ఎరుకల సానులు రావడం వంటి ఘట్టాలను చక్కగా ప్రదర్శించారు. ప్రసాదాలు వండి పంచి పెట్టారు. పాఠశాల ఆవరణ ముందస్తు సంక్రాంతి సంబరాలతో కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్లూమింగ్ బడ్స్ లో సంక్రాంతి వేడుకలు

చంద్రగిరి పట్టణంలోని ఉన్న బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో అధినేత జితేంద్ర ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడారంగం బలోపేతానికే 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి -కెవిబిపురం: రాష్ట్రంలో క్రీడారంగాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర'కు శ్రీకారం చుట్టామని కే వి బి పురం మండల ఎంపిపి ముని లక్ష్మీ నందకుమార్ పేర్కొన్నారు. ఎంపిడివో రామచంద్రయ్య ఆధ్వర్యంలో కే వి బి పురం మండలంలోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ క్రీడాకారులకు క్రీడల్లో ఆసక్తిని పెంచి వారి క్రీడ ప్రతిభను వెలికితీయడానికి ఆడుదాం ఆంధ్ర చక్కటి వేదిక అన్నారు. దీన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. అంతకు ముందు కృష్ణయ్య క్రీడాజ్యోతిని వెలిగించి జెండాను ఆవిష్కరించారు. వాలీబాల్, కోకో, కబడ్డీ వంటి పోటీలలో 34 టీములు పాల్గొన్నాయని పేర్కొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: రాష్ట్రంలో క్రీడారంగాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ బుచ్చినాయుడు కండ్రిగ ఎంపీడీవో సాయి లహరి గుర్తు చేశారు. బుధవారం ఎంపీడీవో సాయి లహరి ఆధ్వర్యంలో బుచ్చినాయుడు కండగ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో, పల్లమాల జిల్లా పరిషత్ హై స్కూలులో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇందిరా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అంతర్ రాష్ట్ర మద్యం బాటిల్స్ సీజ్ ఒకరు అరెస్ట్


అంతర్ రాష్ట్ర మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - తడ: ఎన్నికల దృష్టిలో పుంచుకుని వివిధ చెక్‌పోస్టుల వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా అనుమానం స్పదం గా తిరుగుతున్న ఓ వ్యక్తి వద్ద వున్న అంతర్ రాష్ట్ర మద్యం బాటిళ్లను తనిఖీ చేశారు. నాయుడుపేట డిఎస్పి యం రాజగోపాల్ రెడ్డి తడ పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎస్పి ఆదేశం మేరకు డియస్పి పర్యవేక్షణలో ట్రైనింగ్ డియస్పి పి.సింధు ప్రియ, సూళ్లూరు పేట సిఐ యం మధుబాబు, తడ పోలీస్ స్టేషన్ యస్ఐ జి శ్రీనివాస రెడ్డి తమ సిబ్బందితో కలసి 15 రోజులుగా బీవీ పాళెం చెక్ పోస్టు వద్ద చెన్నై నుండి నెల్లూరు వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో కొంత దూరంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో తడ యస్ఐ జి శ్రీనివాస రెడ్డి వారి సిబ్బంది అతని వద్ద వున్న అట్ట బాక్సులను తనిఖీ చేయగా ఇతర రాష్ట్రాలకు చెందిన బిల్లు లేకుండా 124 మద్యం బాటిళ్లు వుండడం చూసి అతడిని విచారించారు. అతను బాపట్ల జిల్లా, చెరుకుపల్లి మండలం, రాంబొట్ల వారి పాలెం చెందిన జూపూడి బేబెక్కర రావు అని తెలిపారు. చెన్నై నుండి హైదరాబాద్ కు వెళుతున్న కావేరి ట్రావెల్స్ బస్సులో చెన్నై లోని మాదవరం వద్ద బస్సు ఎక్కగా బీవీ పాళెం వద్ద బుధవారం తెల్లవారు జామున 1 గంటకు తనిఖీ చేస్తుండగా బస్సు కొంత దూరంలో ఆగడంతో బస్సు నుండి తన లగేజ్ కాటన్ బాక్సులతో దిగినట్లు తెలిపారు. అతని వద్ద నుండి ఇతర రాష్ట్రాలకు చెందిన 114 ఫుల్ బాటిల్స్, 10 క్వార్టర్ బాటిల్స్ మొత్తం 124 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి పంపామని వారు తెలిపారు. ఈ మద్యం బాటిల్స్‌ను వ్యాపార నిమిత్తం తీసుకెళ్లి అధిక ఆదాయం పొందుతున్నట్లు తెలిసింది. ఈ తనిఖీ లలో ఎఎస్ఐ శ్రీకుమార్ రెడ్డి, పీసీలు వై విజయ్ కుమార్, వై నాగార్జున, హోంగార్డులు పి రామయ్య, కె శ్రీనివాసులు పాల్గొన్నారు.

గంజాయి కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తిరుపతి ఎస్ఈబి స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు రెడ్డి తెలిపారు. సిఐ నాగరాజు కథనం మేరకు..తిరుపతి నగర పరిధిలోని డివిఆర్ హాస్పిటల్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా కాటన్ మిల్లుకు చెందిన కొండాటి శ్రీసాయిచందు వద్ద 1.2 కేజీల గంజాయిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. గంజాయి సరఫరా చేస్తున్న మరొక వ్యక్తిని త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని రిమాండ్ కు పంపామని తెలిపారు. ఈ దాడులలో హెడ్ కానిస్టేబుల్ ఎన్. మనోహర్, కానిస్టేబుళ్లు చిరంజీవి, వినోద్, శోభారాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి గ్రామం పెట్రోల్ బంక్ వద్ద ఎన్ హెచ్ 71 జాతీయ రహదారిపై బుధవారం ఉదయం శిరస నంబేడు గ్రామానికి చెందిన మల్లేపల్లి. జనార్ధన్(37) రోడ్డు దాటుతుండగా నాయుడుపేట వైపు నుండి శ్రీకాళహస్తి వెళుతున్న టాటా వెంట్రా వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. సమాచారం అందుకున్న పెళ్లకూరు మండల ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలం చేరుకొని హుటాహుటిన గాయపడిన వ్యక్తిని ట్రినిటీ హాస్పిటల్ కి తరలించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు కు తరలించగా చికిత్స పొందుతుండగా అతను మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారుల బాల్యాన్ని చిదిమేయొద్దు: ఎస్‌పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: నేటి బాలలే రేపటి పౌరులు, చిన్నారుల బాల్యాన్ని చిదిమేయొద్దని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి సూచించారు. బాల కార్మిక రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిది ద్దడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని నేర దర్యాప్తు విభాగం ఈ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు 'ఆపరేషన్ స్వేచ్ఛ' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలనే ఉద్దేశంతో సిఐడి డీజి ఉత్తర్వులతో, జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు దిశా డిఎస్‌పి కాటమరాజు ఆధ్వర్యంలో బుధవారం పద్మావతి ఫార్మసీ కాలేజీ నుండి తిరుచానూరు పూడి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దిశా డి.యస్.పి కాటమ రాజు మాట్లాడుతూ ఈ ఆపరేషన్ స్వేచ్ఛ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 5 నుండి 11 తేది వరకు జరుగుతుందన్నారు . అందులో భాగంగా జిల్లా పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల బాల కార్మికులుగా పనిచేస్తున్న ఎనిమిది మంది బాలలను విడిపించి, సురక్షితంగా వారి తల్లి దండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కృష్ణ రెడ్డి, మండల లీగల్ సర్వీసు అథారిటీ సభ్యులు, కమాండ్ కంట్రోల్ రూమ్ యస్.ఐ శివాజీ, పోలీసు శాఖ సిబ్బంది, లేబర్ శాఖ వారు, శ్రీ పద్మావతి స్కూల్ అఫ్ ఫార్మసీ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపిలో భారీ చేరికలు

ప్రజాశక్తి-పాకాల: వైసిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో దామలచెరువు, పేరసా ని పల్లి పంచాయతీ లోని తురక పల్లికి చెందిన కొంత మంది గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి,తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నేతృత్వంలో మండలంలో జరిగిన అభివృద్ధికి మద్దతునిచ్చిన వారు వైసిపితోనే సంక్షేమం సాధ్యమని పేర్కొన్నారు. నమ్మి వచ్చిన వారికి అండగా ఉంటామంటూ మోహిత్ రెడ్డి వారికి భరోసా కల్పించారు. దామల చెరువు నుంచి మబ్బునా యనిపల్లి వరకు ఆటో ర్యాలీతో చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక నాయకుడు సంతోష్ ఆధ్వర్యంలో దాదాపు 35 మంది వైఎస్ఆర్ సీపీ కండువాలు కప్పుకున్నారు.పార్టీ మరింత బలోపేతానికి తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామన్నారు. దామలచెరువు పంచాయతీ మబ్బునాయనపల్లికి చెందిన సంతోష్, వినోద్, దాము, మదన, కుమ్మరపల్లికి చెందిన హరికృష్ణ, హరీష్, పదిపుట్ల బైలు పంచాయతీ పెరుమాలగుడిపల్లికి చెందిన మనోహర్, ఆజాద్ నగర్ కు చెందిన యాసానుల్లా, పీరూ సాహెబ్, రమీజాబీ, తస్లీమ్, మంగి నాయన పల్లికి చెందిన చంద్రశేఖర్ ఆ పార్టీలో చేరారు.


వైసిపిలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న మోహిత్‌రెడ్డి

తాయిలాలకు ఓట్లు పడతాయనుకోవడం భ్రమ?: జనసేన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు తాయిలాలు ఇస్తే ఓట్లు వేసేస్తారని అనుకోవడం భ్రమేనని జనసేన చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవర మనోహర్ అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల కోసం నిర్వహించే రాజకీయ పార్టీల సమావేశాలకు కూడా రాని వ్యక్తి మోహిత్ రెడ్డి అని, అలాంటి వ్యక్తి రాజకీయం అనుభవం వున్న పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడులను విమర్శించడం సహేతుకం కాదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘానికి పవన్ కళ్యాణ్, చంద్రబాబును కలిసి దొంగ ఓట్లను తొలగించాలని వినతిపత్రం ఇస్తే ఆగ మేఘాల పైన మోహిత్ రెడ్డి విలేకరుల సమావేశం ఎందుకు పెట్టారో అందరికీ అర్థమవుతుందన్నారు. చంద్రగిరి బరిలో ఈసారి తాను నిలుచుంటానని, ప్రజలు ఎవరిని ఆదరిస్తారో అర్థమవుతుందన్నారు. 2024 ఎన్నికల్లో జనసేన, టిడిపి కలిసి అధికారంలోకి వస్తుందని అప్పుడు అభివృద్ధి ఏంటో చంద్రగిరి నియోజకవర్గంలో చేసి చూపిస్తామన్నారు. ఆమరణ నిరాహార దీక్ష చంద్రగిరి బస్టాండ్ కోసం, ఎర్రావారిపాలెంలో రైతుల కోసం చేయాలని చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యదర్శి ఆకేపాటి సుభాషిని, రఘు, మురళి, హరి, దిలీప్ పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ'

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 'బాబు ష్యూరిటీ– భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమంలో పుత్తూరు రూరల్ మండలం తడుకు పంచాయతీలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను. నగరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గాలి భాను ప్రకాష్, బాండ్ లను అందించి ప్రచారం చేసి, స్థానికులతో కలిసి ప్రజావేదిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న రాక్షస, కక్ష పూరిత పాలనను వివరించి,రేపు బాబు గారు అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధి - సంక్షేమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, తడుకు పంచాయతీ. సర్పంచి వెంకటేష్ బొబ్బిలి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ, పాండురంగయ్య, చంగల్ రాయులు, జనసేన నాయకులు యువకులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఎల్ఐసి ఉద్యోగులు బుధవారం ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా అధికారుల సంఘం కార్యదర్శి గంగులయ్య. ఎన్ఎఫ్ఐటి డబ్ల్యూఎల్ కార్యదర్శి రమేష్, ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎన్. లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తనుకు రావలసిన న్యాయమైన వేతన సవరణ గడుపు18 నెలలు కొవస్తున్నా కనీసం చర్చలు సైతం పిలవక పోవడం దారుణమని వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ అజయ్ కుమార్, యూనియన్ అధ్యక్షుడు దస్తగిరి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

ఎస్వియూకు 'నైలెట్' మంజూరుపై హర్షం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి ఎస్వియూకు కేంద్ర ప్రభుత్వంలోని మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నైలెట్) సంస్థ ప్రాంతీయ కేంద్రాన్ని నెలకొల్పి అభివృద్ధి చేసేందుకు 8 కోట్ల 50 లక్షల రూపాయల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయటంపై ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య వై వి రామిరెడ్డి పేర్కొన్నారు.

విజ్ఞానంతో కూడిన విద్యను అలవర్చుకోవాలి

సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ఫ్రెషర్స్‌డేలో కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జిఎం టి నాగరాజ రావు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజ్ఞానం, సాంకేతికతతో కూడిన విద్యను కష్టపడి చదివితే బంగారు భవిష్యత్తును సాధించవచ్చని కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ టి నాగరాజు రావు అన్నారు. బుధవారం సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో ప్రథమ సంవత్సరం బి ఫార్మసీ, డి ఫార్మసీ, ఎం ఫార్మసీ నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో కెల్లా ఫార్మసీరంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, నూతనంగా కళాశాలలో ప్రవేశించిన విద్యార్థులు కష్టపడి చదవాలని పిలుపునిచ్చారు. సెవెన్ హిల్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం నిరంజన్ బాబు మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడం కోసం అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధిస్తు న్నట్లు తెలిపారు. మైథిల్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో పలువురుని కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఉమాపతి, కళాశాల కరస్పాండెంట్ ఎం సుమలత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


పలువురిని సన్మానిస్తున్న దృశ్యం